# రంజాన్ మాసంలో.. మరమ్మతులు

## రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలపై దృష్టి

జూబ్లీహిల్స్, మార్చి13 : రంజాన్ మాసంలో మసీదుల వద్ద మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మసీదుల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎంఎస్బీ తదితర శాఖల అధికారులు పనులు చేపట్టారు. సోమవారం నుంచి రంజాన్ ప్రార్థనలు ప్రారంభం కావడంతో అధికారులు ఆయా సమస్యలపై దృష్టి సారించారు. రంజాన్ మాసంలో మసీదుల వద్ద నీటి సమస్యలు రాకుండా వాటర్ ట్యాంకర్లతో మంచినీరు సరఫరా చేస్తున్నామని జలమండలి జీఎం ఎస్.హరిశంకర్ తెలిపారు. సీవరేజీ సమస్యలు, ఓవర్ ఫ్లో సమస్యలు తలెత్తకుండా మ్యాన్‌హోల్స్ పూడికతీత పనులు చేపడుతున్నామని తెలిపారు. గుంతలతో రోడ్డు సమస్యలు లేకుండా ఇప్పటికే ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్‌లతో రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులు చేపడుతున్నామని ఈఈ రాజ్‌కుమార్ తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద రహదారుల మరమ్మతులు చేపట్టనున్నామని తెలిపారు. స్ట్రామ్ వాటర్ డ్రైన్లతో ఓవర్ ఫ్లో సమస్యలు తలెత్తకుండా నాలాలు, డ్రైన్ల పూడికతీత పనులు చేపడుతున్నామని తెలిపారు.


యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)

**అశోక్ నగర్ శాఖ**
చిరునామా: 1/10/233/A, సాయిలక్ష్మి రెసిడెన్సీ, అశోక్‌నగర్ స్ట్రీట్ నం.6, అశోక్‌నగర్ కాలనీ, హైదరాబాద్. ఫోన్ నం.8779207061
మెయిల్ ఐడి:ubin0807061@unionbankofindia.bank

**SARFAESI చట్టం, 2002 క్రింద ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

1. అర్జున్ రాజ్ శ్రీవాస్తవ, తండ్రి శ్రీ ప్రకాష్ చంద్ర శ్రీవాస్తవ,1-2-215/B1, శ్రీ దుర్గా నివాస్, గగన్‌మహల్, దోమల్‌గూడ, L.No.4, స్ట్రీట్ నం.7, హైదరాబాద్, పిన్:500029, తెలంగాణ. 2. శ్రీ ప్రకాష్ చంద్ర శ్రీవాస్తవ, తండ్రి శ్రీ బ్రిజ్‌రాజ్ శ్రీవాస్తవ, 1-2-215/B1, శ్రీ దుర్గానివాస్, గగన్‌మహల్, దోమల్‌గూడ, L.No.4, స్ట్రీట్ నం.7, హైదరాబాద్, పిన్:500029, తెలంగాణ (రుణగ్రహీతలు) నుండి సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అశోక్ నగర్ శాఖ (07061)కు బకాయి కాంట్రాక్చువల్ రేట్ వంతున ఛార్జీలు మరియు వడ్డీతోసహా 29-02-2024 నాటికి రూ. 23,28,006.66 (ఇరవై మూడు లక్షల ఇరవై ఎనిమిది వేల ఆరు రూపాయల అరవై ఆరు పైసలు మాత్రమే)లను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అశోక్ నగర్ శాఖ (07061) (సెక్యూర్డ్ క్రెడిటార్) యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన 16-04-2024న విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత/లు మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వేలం కొరకు ఆస్తి వివరణ, రిజర్వు ధర, బయానా, వేలం తేది మరియు సమయం వివరాలు దిగువ ఇవ్వబడినవి: హైదరాబాద్, దోమల్‌గూడ, గగన్‌మహల్ వద్దగల 900 చ.అడుగుల బిల్టప్ ఏరియా, 1200.0 చ.గజాల మొత్తంలో 30.00 చ.గజాల భూమి అవిభాజ్య వాటా, MCH No. 1-2-215/D/528 కలిగిన శివ ప్యాలస్, ఫేజ్-I, రెండవ అంతస్తులో ఫ్లాట్ నం. 528 యావత్తూ మరియు సరిహద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నం. 529, దక్షిణం: ఫ్లాట్ నం. 527, తూర్పు: లాబీ, పడమర: ఖాళీ.

రిజర్వు ధర : రూ. 26,50,000.00 ( ఇరవై ఆరు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే )
చెల్లించవల్సిన బయానా : రూ. 2,65,000.00 ( రెండు లక్షల అరవై ఐదు వేల రూపాయలు మాత్రమే )

పై ఆస్తుల తనిఖీ తేది & సమయం: 08-04-2024న మ॥ 2.00 గం. నుండి సా॥ 5.00 గం. మధ్య
ఆస్తుల తనిఖీ కొరకు సంప్రదించు వివరాలు: కుమార్, నవీన్ & 7280023109
బయానా మొత్తం దాఖలుకు చివరి తేది ఇ-వేలం ప్రారంభం రోజున లేదా ఆలోగా
ఇ-వేలం తేదీ మరియు సమయం: 16-04-2024న మ. 12.00 గం. నుండి సా. 5.00గం. వరకు

అమ్మకం సవివరమైన నియమ నిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా www.unionbankofindia.co.in లేదా సర్వీస్ ప్రొవైడర్స్ వెబ్‌సైట్ www.mstcecommerce.comలో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి. కాగోరు బిడ్డర్లు సవివరమైన నియమ నిబంధనల కాపీని పైన తెలిపిన చిరునామాలో అధీకృత అధికారి నుండి తీసుకొనవచ్చును.

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద చట్టబద్ధ 30 రోజుల అమ్మకం ప్రకటన.**

పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/లు మరియు హామీదారు/లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద నోటీసుగా కూడా దీనిని పరిగణించవలెను.

తేది: 12-03-2024
ప్రదేశం: హైదరాబాద్
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


## చర్లపల్లి జైలులో.. మాత్రలు మింగి ఖైదీ మృతి

చర్లపల్లి, మార్చి 13: చర్లపల్లి సెంట్రల్ జైల్లో జీవిత ఖైదీ నర్సింహ (28) పలు రకాల మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. జైలు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి కేంద్ర కారాగారంలో గత కొద్ది కాలంగా నర్సింహా శిక్ష అనుభవిస్తున్నాడు. అతడి మానసిక స్థితిసరిగా లేక పోవడంతో ఇటీవల ఎర్రగడ్డ మానసిక దవాఖానలో చికిత్స పొందాడు. ఇటీవలే తిరిగి జైలుకు వచ్చాడు. చికిత్సకు సంబంధించిన మందులు, నిద్ర మాత్రలు అందుబాటులో ఉండటంతో వాటిని ఎక్కువ మోతాదులో తీసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో చికిత్స నిమిత్తం అతడిని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో.. నేడు లాజిస్టిక్ కౌంటర్ ప్రారంభం

ఎల్బీనగర్, మార్చి 13: దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్ కౌంటర్‌ను గురువారం ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. ప్రస్తుతం అన్ని రకాల పార్సిల్స్‌ను చేర వేస్తున్న ఆర్టీసీ సంస్థ.. తన సేవలను మరింత విస్తరించి ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు లాజిస్టిక్ విభాగానికి కొత్త లోగోను, బ్రోచర్‌ను తయారు చేశారు. గురువారం ఉదయం 10:15 గంటలకు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో నూతన లాజిస్టిక్ కౌంటర్‌ను ప్రారంభించి, లాజిస్టిక్ లోగోను, బ్రోచర్‌ను ఆవిష్కరించనున్నారని దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్- 2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎండీ సజ్జనార్‌తో పాటుగా ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ రవీందర్, ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## గ్రూప్స్ పోస్టులు పెంచాలి

### నగర గ్రంథాలయంలో అభ్యర్థుల ధర్నా

చిక్కడపల్లి, మార్చి 13:గ్రూప్ -2, 3 పోస్టులను పెంచాలని, డీఎస్సీ ద్వారా 20 వేల పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వం వెంటనే నిరుద్యోగులతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చిక్కడపల్లిలోని నగర గ్రంథాలయంలో పోటీ పరీక్షల అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బక్క జడ్సన్ మద్దతు తెలిపారు. నిరుద్యోగి జనార్దన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని చెప్పడంతో ఆ పార్టీకి మద్దతు తెలిపామన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నిరుద్యోగులు క్రాంతి, సల్మాన్, సింధు, విజయ్ తదితరులు మాట్లాడుతూ.. ఉచిత బస్సు, రూ.500లకు గ్యాస్ లాంటి పథకాలు అమలు చేస్తున్నారని, నిరుద్యోగుల సమస్యను మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో మద్దతు ఇవ్వడం వల్లే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, ప్రభుత్వ పథకాలు ముఖ్యం కాదని, నిరుద్యోగుల భవిష్యత్తు ముఖ్యమని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు ముందే నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## ఆమెను భర్తే చంపాడు

మన్సూరాబాద్, మార్చి 13: ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో ఈనెల 10న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆమెను భర్తే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 10న తెల్లవారుజామున రాచకొండ పోలీస్ కమిషనరేట్ క్యాంపు కార్యాలయం సమీపంలోని ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఈ చలాన్ కాంపౌండింగ్ బూత్ వద్ద భిక్షాటన చేసుకునే మహిళ దారుణ హత్యకు గురైంది. మార్నింగ్ వాక్‌కు వెళ్లే ఓ వ్యక్తి రక్తపు మడుగులో ఉన్న మహిళను చూసి పోలీసులకు సమాచారమిచ్చాడు. అక్కడి చేరుకున్న పోలీసులు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు ఆధారాలను సేకరించాయి. మహిళ హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. భిక్షాటన చేసిన అనంతరం ప్రతి రోజు సదరు మహిళతో పాటు మరో వ్యక్తి ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఈ చలాన్ కాంపౌండింగ్ బూత్ వద్ద రాత్రి వేళ నిద్రించే వారని పోలీసులు గుర్తించారు. సదరు మహిళ హత్య తర్వాత ఆ వ్యక్తి కనిపించలేదు. అతడిని పట్టుకునేందుకు ఆరు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. బుధవారం ఉదయం ఓ వ్యక్తి ఎల్బీనగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. ఆ మహిళను హత్య చేసిన విషయం బయటపడింది. హత్య చేసిన వ్యక్తి తుసమ్మరే బసంత్ సింగ్ అని తేలింది. కొన్ని రోజులుగా తన భార్య జ్యోతి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉన్నదని, దీంతో పాటు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో కత్తితో మెడకోసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. నిందితుడిపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

## లారీ కింద పడి.. జెప్టో డెలివరీ బాయ్ మృతి

శేరిలింగంపల్లి, మార్చి 13: వెనుక నుంచి వస్తున్న లారీ కిందపడి జెప్టో డెలివరీ బాయ్ దుర్మరణం పాలయ్యాడు. ఈ ప్రమాదం రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ శ్రీజారెడ్డి కథనం ప్రకారం.. లంగర్ హౌస్ నివాసి ఎరుకల ఆంజనేయులు (26) జెప్టోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో అతడు బైక్‌పై గచ్చిబౌలి జంక్షన్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్నాడు. గచ్చిబౌలిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ముందు వెనుక నుంచి ఆక్సిజన్ సిలిండర్ల లోడ్‌తో వస్తున్న లారీ కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే బేగంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## అవుశాపూర్‌లో..

ఘట్‌కేసర్, మార్చి13: ఘట్‌కేసర్ పోలీస్టేషన్ పరిధిలోని అవుశాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం.. బీబీనగర్ మండలం, రాఘవాపురం నివాసి స్వామి (37) అవుశాపూర్ గ్రామంలోని ఓ మహిళ ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య కళ్యాణి ఘట్‌కేసర్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త మరణంపై అనుమానం ఉన్నదంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## తెలుగు జాతీయ సదస్సును జయప్రదం చేయండి

బ్రోచర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ, అధ్యాపకులు

హయత్‌నగర్, మార్చి 13: హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో.. 'తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం- సమాలోచన' అనే అంశంపై ఈ నెల 15, 16వ తేదీల్లో రెండు రోజులపాటు తెలుగు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ కళాశాల విద్యశ్రీ బుర్రా వెంకటేశం, ఇతర అధికారులను ఆహ్వానించామని వెల్లడించారు. తెలంగాణలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇతర కళాశాలల నుంచి ఎందరో అధ్యాపకులు పత్ర సమర్పణ చేయనున్నారని తెలిపారు. ఈ సన్నాహక కార్యక్రమాల్లో డాక్టర్ కె.సురేశ్, డాక్టర్ ఈ.శంకర్, డాక్టర్ రాకేశ్ భవాని, డాక్టర్ గంజి శశిధర్, డాక్టర్ బి.రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిత్య పెళ్లికొడుకు అవతారమెత్తిన భర్త

- పరిస్థితులను బట్టి అవతారాలను మార్చిన భార్య
- ఘరానా దంపతులు అరెస్టు

నిందితులు రంజిత్, సంధ్య

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): బడా వ్యాపార వేత్తగా బిల్డప్ ఇస్తూ.. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల ద్వారా పెళ్లిళ్ల కోసం ప్రయత్నిస్తున్న యువతులను మోసం చేస్తున్న ఘరానా దంపతులను సీసీఎస్ స్పెషల్ జోన్ క్రైమ్ టీమ్ పోలీసులు అరెస్టు చేశారు. సీసీఎస్ డీసీపీ శ్వేత కథనం ప్రకారం.. యెలిగంటి రంజిత్ అలియాస్ రాధాకృష్ణ అలియాస్ రాకేశ్, సంధ్య దంపతులు. ఉప్పల్ పరిధిలోని ఫిర్జాదిగూడలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. 2022లో తమ సెల్‌ఫోన్‌ను ఆపరేట్ చేస్తూ.. తెలుగు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లను పరిశీలించాడు. ఆ సమయంలో చాలా మంది యువతులు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో పెండ్లి కోసం తమ ప్రొఫైల్స్ అప్‌లోడ్ చేస్తున్న విషయాన్ని గుర్తించాడు. దీంతో అతడు కూడా నిత్య పెండ్లి కొడుకు అవతారమెత్తాడు. యాప్‌లో ప్రొఫైల్ చూసి, పెండ్లికి సిద్ధం.. నేను ఫలానా దగ్గర ఉద్యోగం చేస్తున్నా.. నీ జీతం ఇంతా.. నేను బిల్డర్‌ను, ఫలానా వద్ద నా వెంచర్ నడుస్తున్నది.. ఇలా ధనవంతుడిగా తనకు తాను పరిచయం చేసుకున్నాడు. అతడి భార్య కూడా సహకరిస్తూ పరిస్థితులను బట్టి ఆమె ఒక్కో రకమైన వేషం మార్చింది. యువతులకు అతడిపై నమ్మకం కుదరగానే.. పర్సనల్‌గా కలుద్దామంటూ చెప్పి.. మాటలు కలుపుతాడు. ఆ తరువాత తనకు అత్యవసరంగా డబ్బులు కావాల్సి వచ్చిందంటూ.. కట్నం డబ్బులో మినహాయించుకోవచ్చు అంటూ.. రకరకాల కారణాలు చూపుతూ యువతుల వద్ద నుంచి అందినకాడికి దోచేశారు. ఈ ఘటనపై కొందరు బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఇన్‌స్పెక్టర్ భిక్షపతి నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేపట్టింది. నిందితులపై గతంలోనూ కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పదుల సంఖ్యలో బాధితులను, లక్షల్లో మోసాలు చేసినట్లు విచారణలో బయటపడింది. షాదీ.కామ్, తదితర మ్యాట్రిమోని సైట్లలో పెండ్లి సంబంధాలు చూసే సమయంలో వారి వారి ప్రొఫైల్‌ను జాగ్రత్తగా పరిశీలించిన తరువాతే నిర్ణయాలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ దంపతుల బారినపడి మోసపోయిన వారెవరైనా ఉంటే.. పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## కూర్చోబెట్టి మాట్లాడం..

సిటీబ్యూరో, మార్చి 13(నమస్తే తెలంగాణ): పెట్టుబడుల మోసానికి సంబంధించిన కేసు విషయంలో మొఘల్‌పురా స్టేషన్‌కు వెళ్లిన బాధితులను నిలబెట్టి, నిందితులను కూర్చోబెట్టి మాట్లాడటంపై' ట్రెండ్ మారింది' అన్న పేరుతో 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనానికి మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్పందించారు. స్టేషన్‌లోకి రాగానే బాధితులు ఎస్సై ముందు కూర్చున్నదని, ఘటనకు సంబంధించి సెల్‌ఫోన్‌లో ఉన్న వివరాలను వివరించేందుకు తన కుర్చీలో నుంచి లేచి ముందుకు వెళ్లిందని తెలిపారు. అప్పటికి ఎఫ్ ఐఆర్ నమోదు కాకపోవడంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా పక్కనే కూర్చొని ఉన్నారని వెల్లడించారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## మెట్రో స్టేషన్లలో మౌలిక వసతులు

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): మెట్రో స్టేషన్‌లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. నగరంలో మొదటి దశలో 3 కారిడార్లలో చేపట్టిన మెట్రో ప్రాజెక్టులో భాగంగా మెట్రో స్టేషన్లలో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆధునికంగా, పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా.. కారిడార్-1 (మియాపూర్- ఎల్బీనగర్) లోని భరత్ నగర్, మియాపూర్ మెట్రో స్టేషన్ల కింద భాగంలో ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. ప్రధానంగా.. భరత్‌నగర్ మెట్రో స్టేషన్ కిందనే కూరగాయల మార్కెట్ ఉండటంతో ప్రయాణికులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థగా అందుబాటులోకి వచ్చిన మెట్రో స్టేషన్లలో మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తున్నారు. మియాపూర్ మెట్రో స్టేషన్‌లో ఎడమ వైపు విలేజ్ జోన్ పరిరక్షణ చర్యలు చేపడుతున్నామని మెట్రో అధికారులు తెలిపారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించాలని.. 15న రిలే నిరాహార దీక్ష

నాంపల్లి కోర్టులు, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ న్యాయవాదుల సురక్షాసమితి ఆధ్వర్యంలో ఈనెల 15న (శనివారం) ఇందిరాపార్క్‌లోని ధర్నా చౌక్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు అధ్యక్షులు అశోక్‌కుమార్ ముంబా ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయవాదుల రక్షణ చట్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని, తక్షణమే ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్ చేస్తూ.. రిలే నిరాహార దీక్షను చేపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. అదే విధంగా 41-ఏ సీఆర్‌పీసీని రద్దు చేసి, నిందితులను కోర్టు ఎదుట హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించాలని విన్నవించారు. ప్రధానంగా న్యాయవాదుల సంక్షేమ నిధికి ప్రతి ఏటా రూ.100 కోట్లు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు రూ.5వేల ఉపకార వేతనాన్ని చెల్లించాలని, న్యాయవాదులకు ఇండ్లను మంజూరు చేయాలనే ప్రధాన డిమాండ్లతో శనివారం రిలే నిరాహార దీక్షను చేపట్టనున్నట్టు వివరించారు. అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొనాలని కోరారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దీక్షను నిర్వహిస్తామన్నారు. సమితి సభ్యులు సత్యనారాయణ (వీపీ), హైమద్ మూన్ (ప్రధాన కార్యదర్శి), బాదే దేవేందర్ (కోశాధికారి), రాకేశ్ కులకర్ణి, ఇతర ఎగ్జిక్యూటివ్ సభ్యులు రిలే నిరాహారదీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రేమ పేరుతో వేధింపులు.. పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి

హిమాయత్‌నగర్, మార్చి13: ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న ఓ యువకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత యువతి బుధవారం నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అడ్మిన్ ఎస్సై నరేశ్ కుమార్ కథనం ప్రకారం.. నారాయణగూడలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న ఓ యువతి (24) ప్రైవేట్ ఉద్యోగి. స్థానికంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ యువతి 2021లో డిగ్రీ పూర్తి చేసింది. సీహెచ్ హరీశ్ అనే యువకుడు కూడా అదే కళాశాలలో చదువుకున్నాడు. చదువుకుంటున్న సమయంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడటంతో స్నేహితులుగా ఉంటూ.. గత నాలుగేండ్లుగా ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఇంతకాలం బాగున్న హరీశ్.. గత మూడు నెలలుగా యువతిపై తప్పుగా మాట్లాడుతూ.. వేధింపులకు గురి చేస్తున్నాడు. ఆ యువతి జాబ్ చేసే ప్రాంతానికి వెళ్లి అసభ్యంగా తిట్టడంతో పాటు ఆమె చెంపపై కొట్టాడు. దీంతో హరీశ్ వేధింపులు భరించలేక.. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై శిరీష కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురికి జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి13 (నమస్తే తెలంగాణ): స్నేహితులతో కలిసి జల్‌పల్లి చెరువు ప్రాంతానికి వెళ్లిన మహిళ, ఆమె స్నేహితుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 5,500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉషాక్రాంతి తీర్పునిచ్చారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.గోపాల్ కథనం ప్రకారం.. మీర్‌పేట ప్రాంతానికి చెందిన యువతి తన ఇద్దరు స్నేహితులతో కలిసి 2017, జూన్ 28న సాయంత్రం జల్‌పల్లి చెరువు వద్దకు వెళ్లింది. అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్స్ హబీబ్ హుస్సేన్ (27), మొయిన్ ఖాన్(26), మహ్మద్ అజార్ షరీఫ్(29) కలిసి యువతి వద్దకు వెళ్లి.. వారి ఫొటోలు తీసి, బెదిరించి డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేశారు. బలవంతంగా యువతి, ఆమె ఇద్దరు స్నేహితుల వద్ద నుంచి సెల్‌ఫోన్స్, నగదును తీసుకుని యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. జరిగిన ఘటనపై బాధిత యువతి పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయస్థానం.. ముగ్గురు నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

## న్యాయమూర్తిగా ఎంపిక.. సన్మానం

న్యాయమూర్తిగా ఎంపికైన సరళారాణిని సన్మానిస్తున్న న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి13 (నమస్తే తెలంగాణ): కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీలేదని నిరూపించారు రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయశాఖ ఉద్యోగిని సరళారాణి. ఇటీవల తెలంగాణ హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి, న్యాయమూర్తిగా ఎంపికైన సరళారాణిని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు సీహెచ్. ఉపేంద్ర, ఫుడ్ కమిషన్ సభ్య